ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







# గజ..గజ..

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చలితో వణికిపోతున్న ఏజెన్సీవాసులు
- గిన్నెధరిలో అత్యల్పంగా 12.1డిగ్రీలు
- నెగళ్లతో ఉపశమనం పొందుతున్న గ్రామీణులు

ఆసిఫాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అడవుల జిల్లా కుమరం భీం ఆసిఫాబాద్‌లో చలిపంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం జిల్లాలోని తిర్యాణి మండలంలోని గిన్నెధరి గ్రామంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 11.8డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీనికితోడు గ్రామాల్లో పొగమంచు కమ్మేస్తోంది. చలికి ఏజెన్సీ మండలాలు గజగజ వణికిపోతున్నాయి.చిన్నారులు, వృద్ధులు చలి నుంచి రక్షణ పొందేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి. సాయంత్రం 6దాటితే జనాలు బయటికి వెళ్లనంత చలితీవ్రత పెరిగింది. ముఖ్యంగా అడవులు అధికంగా ఉన్న మండలాలైన తిర్యాణి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, బెజ్జూరు, చింతలమానెపల్లి, పెంచికలపేట, దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ ప్రాంతాల ప్రజలు చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెటర్లు, జర్కిన్‌లు ధరిస్తున్నారు. గ్రామీణప్రాంతాల్లో ప్రజలు చీకటైతే చాలు ఇళ్ల ముందు నెగళ్లు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందోనన్న ఆందోళన జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది. నిజానికి ఆసిఫాబాద్ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈసారి సీజన్‌లో చలి పంజా విసురుతుండడంతో జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రం చీకటి పడితే చాలు జనాలు లేక బోసిపోతోంది. ఉదయం 9దాటితే కానీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. తెల్లవారు లేవగానే పొలం పనులకు వెళ్లే రైతులు, పాలు పోసే వ్యాపారులు, పేపర్ బాయ్స్, వాకర్స్ చలిబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలితీవ్రత ఒక్కసారిగా పెరగడంతో వైద్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు రక్షణ లేకుండా చలిలో బయటకు వెళ్లితే శ్వాసకోస సంబంధిత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

**● గిన్నెధరిలో 12.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు**

జిల్లాలో పగలంతా వేడిమి ఉంటున్నా సాయంత్రం 6అయిందంటే చాలు చలి మొదలవుతోంది. సోమవారం జిల్లాలోని తిర్యాణి మండలం గిన్నెధరిలో 12.1డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అలాగే సిర్పూర్(యు)లో 12.3డిగ్రీలు, వాంకిడిలో 12.9డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 13.2డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

**● పెరుగుతున్న చలి తీవ్రత**

జైనూర్: మండలంలో చలితీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. చలి ధాటికి వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రజలు మంట కాగుతున్నారు. నిరుపేదలు రాత్రి సమయాల్లో చలికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. నవంబరులోనే ఇంత తీవ్రత ఉంటే, రానున్నరోజుల్లో ఇంకేలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

## సివిల్ ఫిర్యాదులను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సివిల్ ఫిర్యాదులను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. భూములకు సంబంధించి గొడవలు పెట్టుకోరాదని అందరు సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు బాధితులు తీసుకువచ్చే ఎలాంటిఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదన్నారు. వాటికి సంబంధించిన సమాచారాన్ని బాధితులకు తప్పకుండా తెలపాలని సూచించారు. ప్రస్తుతం సైబర్‌నేరాలు పెరుగుతున్నాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

## ఉన్నత చదువుతో నిర్ధేశిత లక్షాలను చేరుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జంగుబాయి

జైనూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఉన్నత విద్యనభ్యసించి నిర్దేశిత లక్షాలకు చేరుకోవాలని రాణి దుర్గావతి మహిళ సొసైటీ చైర్మన్ గోడాం జంగుబాయి అన్నారు. మండలంలోని రాసిమెట్ట గిరిజన సంక్షేమశాఖ గురుకుల విద్యాలయంలో సోమవారం ఆమెవిద్యార్థినులకు ఆరోగ్యం, విద్యపట్ల అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుడూ తల్లిదండ్రుల ఆశలను వమ్ముచేయకుండా కుటుంబానికి, సమాజానికి గొప్పపేరు తీసుకురావాలి సూచించారు. కార్యక్రమంలో సొసైటి జనరల్ సెక్రెటరీ ఆత్రం తులసీబాయి, సభ్యులు అనకరాంబాయి, కుర్సెంగ గంగాబాయి, ఆత్రం తీర్థబాయి, కోవ పంచుబాయి, కుంరరాంబాయి పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీఎస్ నాయకుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాటసమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఇస్లాంబీన్‌హసన్, జిల్లాఅధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్ రూ.4 వేల నుంచి రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతోకూడిన వినతిపత్రంను కలెక్టరేట్ ఏవోమధుకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మహేష్, శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌కు చేరుకున్న ధర్మజాగరణ రథయాత్ర




ఆసిఫాబాద్‌కు చేరిన ధర్మజాగరణ రథయాత్ర

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రథయాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఇన్‌చార్జి కోటేశ్వర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో పయనించాలన్నారు. హిందువులను చైతన్యపరిచేందుకు ఈ రథయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్ర ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో మూడురోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ధర్మజాగరణ కమిటీసభ్యులు మధుకర్, వేణుగోపాల్, సంతోష్, మధునయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## జోడేఘాట్ అడవుల్లో పులి సంచారం



జోడేఘాట్ అడవుల్లో పులి అడుగులను గుర్తిస్తున్న అధికారులు

కెరమెరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడేఘాట్ అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు జిల్లాఅటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ నిర్ధారించారు. రెండురోజులుగా ఉట్నూర్, నార్నూర్ అటవీప్రాంతంలో పెద్దపులి పశువులపై దాడి జరిపినట్లు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. కెరమెరి, జోడేఘాట్ అటవీప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు, తమ అధికారులు పులి అడుగులను గుర్తించినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులికి సంబంధించిన ఎటువంటి సమాచారం ఉన్నా 9440810099కు సమాచారం అందించాలన్నారు.

## పారిశుధ్య కార్మికుల నిరసన



కెరమెరిలో సమావేశంలో మాట్లాడుతున్న జీపీ కార్మికులు

బెజ్జూరు/కెరమెరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఆరునెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణ గడిచేది ఎలా అంటూ ప్రశ్నించారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమకు నెల నెలా వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కెరమెరిలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజేందర్, బుద్ధు, శ్రీనివాస్, సంతోష్, మల్లేష్, స్వామి, గోపి, వెంకటేష్, శ్రీనివాస్, భుజంగరావు, దత్తు, జేవంతరావు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పలువురు ఎస్సైల బదిలీలు

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సైలను బదిలీచేస్తూ సోమవారం పోలీసుశాఖ ఉత్తర్వులు జారీచేసింది. లింగాపూర్ ఎస్సైగా పనిచేస్తున్న ప్రవీణ్‌ను బెజ్జూరుకు, బెజ్జూరు ఎస్సైగా పనిచేస్తున్న విక్రమ్‌ను ఆసిఫాబాద్ వేకెన్సీ రిజర్వుకు, డీసీఆర్‌బీ ఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్‌గంగన్నను లింగాపూర్‌కు, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న మహేందర్‌ను ఈసుగాంకు, ఈసుగాం ఎస్సైగా పనిచేస్తున్న రమన్ కుమార్‌ను ఆసిఫాబాద్ వేకెన్సీ రిజర్వుగా, ఆసిఫాబాద్ డీఎస్‌బీ ఎస్సైగా పనిచేస్తున్న సందీప్‌కుమార్‌ను కాగజ్ నగర్ రూరల్‌కు, సీసీఎస్‌లో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీకాంత్‌ను ఆసిఫాబాద్ రెండో ఎస్సైగా, రామగుండం వేకెన్సీరిజర్వులో ఉన్న ఆంజనేయులును ములుగుజిల్లా వేకెన్సీ రిజర్వుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఆరెకుల నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర చంద్రాపూర్‌లోని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాం అయ్యర్‌ను ఆయన నివాసంలో సోమవారం జిల్లా ఆరెకులసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆరెకులస్తులు ఓబీసీ సర్టిఫికేట్ ఇప్పించాలని, సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు సతీష్ బాబు, శ్రావణ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు ప్రారంభం

జైనూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్రన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సోమవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను మండల సహకారచైర్మన్ కొడప హన్నుపటేల్, సీపీవో నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంద్ర షేకు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా తొలిరోజు క్వింటాలుకు రు. 7,521 రుపాయలు పత్తి ధర ఉందని సీపీవో నరేష్ తెలిపారు. అనంతరం సహకారచైర్మేన్ కొడప హన్నుపటేల్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని స్టార్ జిన్నింగ్, సర్రన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలలో సీసీఐ ద్వారా పత్తికొనుగోలు ప్రారంభమయ్యాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటి, జిన్నింగ్ మిల్లు యజమాని అబ్దుల్లా, మాజీ వైస్ఎంపీపీ షేక్ రషీద్, మాజీ మండల కోఆప్షన్‌సభ్యుడుఅఫోజ్‌ఖాన్, అడె నీలాబాయి, రాజ్‌కుమార్, లింగు, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూపు-3 పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన గ్రూపు-3పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో 18పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయగా పేపర్-3కి 4471మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 2757మందిఅభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. 1714మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని మాతృశ్రీడిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించారు. అలాగే పట్టణంలోని పీటీజీ బాలురగురుకులపాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను పరీక్షల నోడల్ అధికారి, అదనపుకలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు-3పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తిఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్య పర్యవేక్షకులు, ఆయాశాఖల అధికారుల సమన్వయంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షలు పూర్తిఅయినందున ఓఎంఆర్‌జవాబు పత్రాలను భారీ బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూంకు తరలించామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల రీజనల్‌కో ఆర్డినేటర్ లక్ష్మీనర్సింహం, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరి కోతకు వచ్చిన తరువాతే కోయాలి

**● అదనపు కలెక్టర్ దీపక్ తివారి**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరి పూర్తి కోతకు వచ్చిన తరువాత మాత్రమే యంత్రాలు వినియోగించి పంట కోయించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వ్యవసాయ, సహకార, గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాలశాఖల అధికారులు, హార్వెస్టర్ యజమానులతో వానాకాలం కోతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంట పూర్తి కోతదశకు వచ్చిన తరువాత మాత్రమే కోయించాలని తెలిపారు. కోతకు వచ్చిన తరువాత కోయడం ద్వారా తేమశాతం, తాలు, గడ్డి లేకుండా నాణ్యమైన పంట వచ్చే అవకాశం ఉందన్నారు. తద్వారా రైతులకు, కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. రైతు నేస్తం ద్వారా వ్యవసాయ శాఖాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి కొనుగోలు కేంద్రానికి వెళ్లి రైతులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు బిక్కు, రబ్బానీ, అదనపు గ్రామీణాభి వృద్ధి అధికారి రామకృష్ణ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు, హార్వెస్టర్ యజమానులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు సురేష్‌కుటుంబానికి అండగా ఉంటామని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రహెమాన్ అన్నారు. ఇటీవల మృతిచెందిన జర్నలిస్టు సురేష్ కుటుంబానికి సోమవారం రెండు నెలల సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీడియా అకాడమీ ద్వారా అన్నిరకాల బెనిఫిట్స్‌ను బాధిత కుటుంబానికి అదే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రకాష్‌గౌడ్, సతీష్, హరికృష్ణ, శ్రీనివాస్, సురేష్‌చారి, శ్రీనివాస్, రాధాకృష్ణచారి, ఎమ్మార్పీఎస్ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

కౌటాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో తలోడి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో హనుమంతు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, మెనూప్రకారం భోజనం వడ్డించాల న్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయుడు, ఎస్‌వో పవిత్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మండల గోండ్వానా ఆదివాసీ కోయ సంక్షేమసంఘం

కౌటాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోండ్వానాఆదివాసీ కోయసంక్షేమ సంఘం మండల కార్యవర్గంను సోమవారం జిల్లాఅధ్యక్షుడు సోయం చిన్నయ్య సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా నైతం బాజీరావు, అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధానకార్యదర్శిగా దిలీప్, కార్యదర్శులుగా సంతోష్, ఆత్మారాం, కార్యవర్గసభ్యులుగా వసంత్,సంతోష్,దిలీప్,మధుకర్‌ను ఎన్నుకున్నారు.

## నేడు రైతు నేస్తం కార్యక్రమం

కౌటాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్న 12.30గంటల వరకు రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తామని ఏవో ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సందేహాలకు వ్యవసాయ నిపుణులు సమాధానాలు ఇస్తారన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగాఉన్న అసిస్టెంట్ కుక్-2, స్వీపర్-1పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వేణుగోపాలరావు, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్‌శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

కౌటాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని జిల్లాపరిషత్ సెకండరీపాఠశాలను సోమవారం ఎంపీడీవో ప్రసాద్ తనిఖీచేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బియ్యం, కూరగాయలు శుభ్రంచేసి మెనూప్రకారం తప్పనిసరిగా వండించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విధంగా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. భోజనం సరిగ్గా వండనట్లయితే ఏజెన్సీలను మార్చడానికి సిఫారసు చేస్తామని అన్నారు. ఆయనవెంట ఎంఈవో హనుమంతు, కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని తిర్యాణి మండలం

- నిధులు మంజూరైనా ఉపయోగించని వైనం
- మండలానికి విరివిగా వస్తున్న పర్యాటకులు
- వసతుల కల్పన మాత్రం శూన్యం



తిర్యాణి మండల కేంద్రం

తిర్యాణి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం అన్ని రంగాల్లో వెనకబడి ఉంది. ఏజెన్సీ మండలాన్ని అభివృద్ధి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలం అభివృద్ధికి సింగరేణినుంచి డీఎంఎఫ్ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి భారీగా నిధులు మంజూరవుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో వాటిని వినియోగించకపోవడంతో మండలంలో కనీసవసతులు కరువయ్యాయి. దీంతోప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు.



బస్టాండ్ ప్రాంతం

మండలంలో 29గ్రామ పంచాయతీలు ఉండగా 134అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇందులో 25వేలకు పైగా జనాభా నివసిస్తుండగా 90శాతానికి పైగా ఆదివాసీలే ఉన్నారు.

**కానరాని రోడ్లు..**

మండలకేంద్రం నుంచి దాదాపు50శాతం గ్రామాలకు వెళ్లేందుకు కనీసం రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే గుండాల, మంగి, కౌటగాం, గీసిగూడ, గోపెర, భీంరెళ్ల, బుగ్గరామన్నగూడెం, తాటిగూడ గ్రామాల ప్రజలకు కాలినడకే శరణ్యమవుతోంది. చాలా గ్రామాలకు మధ్యలో ఉండే వాగుల వద్ద వంతెనలు నిర్మించక పోవడంతో వాగులు ఉప్పొంగిన సమయంలో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. మండలంలోని జలపాతాలనుచూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కానీ పర్యాటకుల కోసం ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు.

**సులభ్ కాంప్లెక్స్ లేక తిప్పలు..**

మండల కేంద్రానికి వివిధపనుల కోసం వచ్చే ప్రజలతో పాటు మండల కేంద్రంలో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు సైతం సులభ్‌కాంప్లెక్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వేరేమార్గం లేక చెట్లు, వాగులు, వంకలు, రోడ్ల పక్కన కానిస్తుండడంతో తీవ్రదుర్గంధం వ్యాపిస్తోంది. మండలకేంద్రంలో ప్రతివారం నిర్వహించే వారసంతతో సమస్య మరింత తీవ్రమవుతోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో కూరగాయలు అమ్ముకోవడానికి వచ్చే వ్యాపారులతోపాటు కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలుపడే అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

**పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..**

**- వెడ్మ భగవంతరావు, తుడుందెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి**



పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రకృతి అందాలకు నిలయమైన తిర్యాణి మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. మండలకేంద్రం నుంచి అన్ని గ్రామాలకు రోడ్డుసౌకర్యం కల్పించాలి. డీఎంఎఫ్‌టీ నిధులు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలి.

## ఎదురెదురుగా బైక్‌లు ఢీ

**- తీవ్ర గాయాలతో ఇద్దరు యువకులు మృతి**

**- మరొకరికి గాయాలు**

మంచిర్యాల అర్బన్, నవంబ రు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యా ల జిల్లా కేంద్రంలోని దొరగారి పల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఓ బైక్‌పు కూర్చుని ఉన్న మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దొరగారి పల్లెకు చెందిన ముల్క ఉదయ్ (31)పని నిమిత్తం బైక్‌పై మంచిర్యాలకు వచ్చాడు. తన పని ముగించుకొని జాతీయ రహదారి మీదుగా తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఎత్తి నర్సింహా (35) తన సోదరుడి అత్త మరణించిందనే వార్త తెలియడంతో భార్య రమతో కలిసి బైక్‌పై గద్దరాగడిలో నివాసం ఉంటున్న తన సోదరుడి ఇంటికి అదే రహదారి మీదుగా వెళ్తున్నాడు. మార్గమధ్యలో వీరిద్దరు ఒకరి వాహనాన్ని ఒకరు వేగంగా ఢీకొట్టడంతో కింద పడ్డారు. ఉదయ్, నర్సింహా తలలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. నర్సింహా బైక్‌పై కూర్చున్న రమకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా రమను మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గాయాలపాలైన రమ ప్రభుత్వాసుత్రిలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం అమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఒకే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటనతో ఆ ప్రాంతంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు పట్టణ ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### భార్య ప్రసవం ఉందని సెలవుపై..


రోధిస్తున్న ఉదయ్ భార్య పావని

కాగా ముల్క ఉదయ్ భోపాల్‌లో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. 2015లో ఆర్మీ జవానుగా ఎంపికయ్యాడు. 2022లో మంచిర్యాలకు చెందిన పావనితో ఆయనకు వివాహమైంది. పావని గర్భిణి. కాగా సోమవారం ఆమెకు డెలివరీ డేట్ వైద్యులు ఇవ్వడంతో భార్య డెలివరీ కోసమని పది రోజుల క్రితమే ఉదయ్ సెలవుపై ఇంటికి వచ్చాబడు. తెల్లవారితే భార్యకు డెలివరీ అవుతుందని, పుట్టిన బిడ్డను కళ్లారా చూసుకుందామని భావించిన ఉదయ్‌ని మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బిడ్డ పుట్టాక ఆ సంతోషాన్ని తన భర్తతో కలిసి పంచుకుందామని అనుకున్న పావనికి ఉదయ్ మృతి వార్త తెలియగానే షాక్‌కు గురైంది. భర్త మృతదేహం వద్ద ఆమె రోదన స్థానికులను కలిచివేసింది.

## చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తాండూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామానికి చెందిన వేల్పుల సిద్ధార్థ అలియాస్ సిద్దు అనే యువకుడుడి చోరీ కేసులో అరెస్టు చేశామని తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి తెలిపారు. చిప్పకుర్తి తిరుపతి ఇంట్లో ఎవరు లేని సమయంలో తాళం పగులగొట్టి వారి ఇంట్లో నుంచి 81 గ్రాముల బంగారాన్ని చోరీ చేయగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. వెంటనే తాండూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ కేసును ఛేదించి నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశామని తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్‌ఐతో పాటు సిబ్బంది మనోహర్, శ్రీనివాస్, మల్లేష్‌ను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అభినందించారని సీఐ తెలిపారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ అసిస్టెంట్ కోర్టు న్యాయాధికారి యువరాజ్ సోమవారం తీర్పునిచ్చారు. దహెగాం ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం లోని చిన్నరాస్పెల్లి గ్రామానికి చెందిన సపిల బాపు 2022 అక్టోబరు 27న పొలంపనికి వెళ్లినప్పుడు అదే సమ యంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన బుర్స పోశం అనేవ్యక్తి పాత కక్షలు మనసులో పెట్టుకొని అతనిపై కత్తితో దాడిచేశాడు. బాధితుడు సాపిల బాపు భార్య సాపిల కళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సనత్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా పీపీ ప్రసాద్‌కోర్టులో సాక్షులను హాజరుపర్చారు. జడ్జి యువరాజ్ విచారణ జరిపి నేరం రుజువు కావడంతో నిందితుడిపై హత్యాయత్నం కేసు కింద మూడు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసినా ప్రస్తుత కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, దహెగాం ఎస్సై రాజు, ఆసిఫాబాద్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, కోర్టు సిబ్బంది బాలాజీని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

## పేకాట స్థావరంపై దాడి

పెంచికలపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తవాడలో పేకాట ఆడుతున్న ముగ్గురుని పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించగా పేకాటఆడుతున్న వారిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. వారివద్ద రూ.21,400 నగదు, మూడుసెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

## ఎస్బీఐలో చోరీకి యత్నం

సిర్పూర్(టి), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్‌ఇండియా బ్యాంకులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న బ్యాంకుమేనేజర్, ఎస్సై కమలాకర్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కిటికీ వద్ద స్వల్పంగా దొంగలు పగు లగొట్టే ప్రయత్నం చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. సమాచారం మేరకు పోలీసులు ప్రాథమికంగా విచారణ చేపట్టారు. దీనిపై ఇప్పటి వరకు బ్యాంకు మేనేజర్ నుంచి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## ప్రాణహిత తీరం వెంట హెలికాప్టర్ చక్కర్లు

వేమనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి సమీపంలోని ప్రాణహితన నది తీరం వెంట సోమవారం హెలికాప్టర్ నాలుగైదు సార్లు చక్కర్లు కొట్టింది. సరిహద్దున ఉన్నమహారాష్ట్రలో ఈ నెల 20న ఎన్నికలు ఉండడంతో మావోయిస్టు కదలికలపై పోలీసు ఉన్నతాధికారులు హెలికాప్టర్ ద్వారా పరిశీలించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. ముందస్తు చర్యగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు గట్టి బందోబస్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## అడవుల సంరక్షణకు పాటుపడాలి

దండేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణ కోసం గిరిజనులు బాధ్యతగా పాటుపడాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అన్నారు. దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధి దమ్మనపేట గిరిజన గ్రామంలో సోమవారం అటవీ చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ పోడు భూముల పేరుతో అటవీ ప్రాంతంలో చెట్లను నరికివేడయం చట్టరీత్యా నేరమన్నారు. రిజర్వు పారెస్టు భూములో చెట్ల పోదలు నరుకుతూ అడవికి తీవ్ర నష్టం చేయడం వల్ల మనకే నష్టం వాటిళ్లుతుందన్నారు. కార్యక్రమంలో దండేపల్లి ఎస్సై ఉదయ్ కిరణ్, అటవీ, పోలీసు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా క్యాంటీన్ గోడ కూల్చివేత

బెల్లంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ గోడను నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. క్యాంటీన్ నిర్మాణ పనులు గత కొన్ని రోజులుగా సాగుతున్నాయి. గోడల వరకు నిర్మాణం జరిగింది. గత నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో గోడలను కూల్చివేశారు. దీంతో మహిళ సంఘాల సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శరత్ అనే వ్యక్తి గోడను కూల్చి ఆస్తినష్టం చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. మంగళవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు గోడను కూల్చిన శరత్‌పై చర్యలు తీసుకుని పనులు జరిగే విధంగా చూడాలని మహిళా సంఘాల సభ్యులు వినతిపత్రం అందజేశారు.

## రైతులకు అవగాహన

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మెర, ఆస్నాద గ్రామాల్లో ఏడీఏ బానోత్ ప్రసాద్ సోమవారం వరి, పత్తి పంటల్లో నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.వరి కోతల తర్వాత కర్రలను కాల్చవద్దని సూచించారు. ఏఈవోలు సాగర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

# అతివలకు అండగా..

- న్యాక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ
- బ్యాచ్‌ల వారీగా గ్రామాల్లో శిక్షణ తరగతులు
- కార్మిక కుటుంబాల మహిళల ఆసక్తి


కుట్టు మిషన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

రెబ్బెన, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రుద్యోగ మహిళలు, యువతులు, స్వయం ఉపాధి రంగంలో రాణించాలనే లక్ష్యంతో అందిస్తున్న వృత్తి నైపుణ్యశిక్షణ వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోంది. కార్మిక కుటుంబాల్లోని మహిళలకు న్యాక్‌ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌ను అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా నేర్పిస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన వారికి ఉచితంగా మిషన్లతోపాటు సర్టిఫికెట్లు పంపిణీ ఇస్తున్నారు. దీంతో సింగరేణి కార్మిక కుటుంబాల్లోని నిరుద్యోగులు కుట్టుశిక్షణపై ఆసక్తి చూపుతున్నారు.

### లేబర్ కార్డుతోనే..

కార్మికశాఖ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో అందిస్తున్న వృత్తి నైపుణ్యశిక్షణ పొందాలంటే లేబర్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రీషియన్, తాపీమేస్త్రీ, ప్లంబింగ్ వంటి పనులు చేసే కార్మికులకు ఇప్పటికే లేబర్ గుర్తింపు కార్డులు జారీచేసింది. కార్మిక కుటుంబాల్లోని నిరుద్యోగ మహిళలు, యువతులకు న్యాక్ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణను పొందాలంటే తప్పనిసరిగా లేబర్‌కార్డులో పేరు నమోదు అయి ఉండాలి. ఈ నిబంధన కారణంగా గ్రామాల్లో చాలామంది ఉత్సాహం ఉన్నా కార్డులేక శిక్షణకు దూరమవుతున్నారు. లేబర్‌కార్డు ఉన్న కార్మికుడి భార్య, కూతురువృత్తి నైపుణ్య శిక్షణకోసం దరఖాస్తులు చేసుకుంటే శిక్షణ ఇస్తారు. లేబర్‌కార్డులో పేరుండి 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు శిక్షణకు అర్హులు. న్యాక్ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే బ్యాచ్‌ల వారీగా శిక్షణ అందిస్తున్నారు.

### మండలంలో ప్రారంభం..

కార్మికశాఖ సహకారంతో న్యాక్ ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాల్లోని మహిళలకోసం వృత్తినైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలోనే మొదటగా రెబ్బెన మండలంలో ఏర్పాటుచేశారు. కుట్టుశిక్షణపై ఆసక్తిఉన్న వారికి దరఖాస్తుల ఆధారంగా గ్రామాల్లో బ్యాచ్‌ల వారీగా శిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. 90రోజుల కాలపరిమితితో రెబ్బెన మండలం నంబాలలో ఆగస్టు 16న 23మందితో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. మూడు నెలల పాటు నిపుణులతో శిక్షణ అందించారు. అవసరమైన మెలుకువలు నేర్పిస్తూ కుట్టుపై నైపుణ్యత సాధించేలా కృషి చేశారు. జిల్లాలో న్యాక్ ద్వారా శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ నవంబరు 20తో శిక్షణ పూర్తి చేసుకోనుంది. అనంతరం వారికి పరీక్షలు నిర్వహిస్తారు. అర్హత సాధించిన వారికి సుమారు రూ.10వేల విలువైన మిషన్‌తోపాటు కిట్‌ను ఉచితంగా పంపిణీ చేస్తారు. త్వరలో సర్టిఫికెట్లు అందించనున్నారు. వంకులం గ్రామ పంచాయతీ పరిధిలోని రాళ్లపేటలో 26మందితో రెండోబ్యాచ్ ఫిబ్రవరి 5న ప్రారంభమైంది.

### కుట్టుమిషన్ నేర్చుకోవాలని ఆసక్తి..



కుట్టుమిషన్ నేర్చుకోవాలని ఆసక్తి ఉండేది. న్యాక్ సంస్థ ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ నేర్పించేందుకు శిక్షణ ఇవ్వటంతో దరఖాస్తు చేసుకున్నాను. శిక్షణలో చక్కగా నేర్పారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా బాటలు వేయవచ్చు. ఇప్పుడు అన్ని రకాల కుట్లు కుడుతున్నాను. డిజైన్ వర్క్‌తో జాకెట్లు కుడుతున్నాను.

-సొగ్గాల అర్చన, గోలేటి

### పట్టు సాధిస్తున్నాం..



మా ఊరిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని న్యాక్ అధికారులు చెప్పటంతో దరఖాస్తు చేసుకున్నాను. కుట్టు శిక్షణపై మంచి పట్టు సాధించాను. ఇప్పుడు స్వయం ఉపాధితో ఆర్థికంగా అడుగులు వేయవచ్చన్న నమ్మకం వచ్చింది. ప్రతిఒక్కరూ స్వయం ఉపాధిపై పట్టు పెంచుకోవాలి. అప్పుడే సత్ఫలితాలు వస్తాయి.

-దేవిక, గోలేటి

### శిక్షణ బాగుంది..



న్యాక్ సంస్థ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్ నేర్పిస్తున్నారు. నేను దరఖాస్తు చేసుకొని శిక్షణకు క్రమ ం తప్పకుండా హాజరై నేర్చుకున్నాను. కుట్టుమిషన్‌పై పట్టు వచ్చింది. స్వయం ఉపాధి చేసుకునేందుకు అవకాశం కూడా ఏర్పడింది.

-దీపిక, గోలేటి

### ఆసక్తి ఉండాలి..



ఏ రంగంలోనైనా ఆసక్తి ఉంటే ఇట్టే రాణించవచ్చును. మహిళలు స్వయం ఉపాధివైపు బాటలు వేసేందుకు కుట్టుమిషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంట్లో ఆదాయం పెంచుకునేందుకు చక్కటి మార్గం ఉంటుంది. మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. వారి ఆసక్తి తగ్గట్టుగా చక్కగా నేర్పిస్తున్నాం.

-ముక్తేశ్వరి, శిక్షకురాలు

### న్యూస్ బాక్స్

## చిమూర్ బాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే హరీష్ బాబు


ఆలయంలో ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, నవంబరు 18: మహారాష్ట్రలోని చిమూర్‌లోని బాలాజీ ఆలయాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ


దుప్పట్లతో దివ్యాంగులు

కాగజ్‌నగర్, నవంబరు 18: కాగజ్‌నగర్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చైతన్య వికలాంగుల సంఘం సభ్యులకు సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభాస్‌ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, సుంకరి రాజేష్, మహేష్, చండే సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కాగజ్‌నగర్, నవంబరు 18: కాగజ్‌నగర్ చింతగూడకు చెందిన ఇగురపు ధన్‌రాజ్ కొన్నిరోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోవటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పట్టుకున్నట్టు పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈమేరకు బాధితుడికి సెల్ ఫోన్ అందజేశామన్నారు.

## గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

కౌటాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కమిటీని సోమవారం జిల్లాఅధ్యక్షుడు మోరేశ్వర్, నగేష్ ఆధ్వర్యంలో ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా ప్రకాష్, కార్యదర్శిగా రవి, సలహాదారు డికి వసంత్, ఉపాధ్యక్షుడిగా సాయికృష్ణ, సభ్యులుగా శ్రీనివాస్, విలాస్, కోశాధికారిగా వినిత్‌ను ఎన్నుకున్నారు.

## ఇక్కడ విధులు నిర్వహించడం సంతృప్తినిచ్చింది: ఏవో

సిర్పూర్(టి), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఏవో మధులత అన్నారు. సోమవారం ఆమెతోపాటు ఏఈవో కవితకు మండలంలోని ఫర్టిలైజర్ దుకాణం డీలర్లు సోమవారం సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఈమండలంలో కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తాను సిర్పూర్ (టి) నుంచి వెళ్తున్నందున బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏవోలు గిరీష్, రామకృష్ణ, ఏఈవోలు విశాల్, రవికుమార్, డీలర్లు సత్యనారాయణ, మారుతి, అబ్దుల్ తస్కీన్, నారాయణరెడ్డి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సప్తాహం


దేవతామూర్తులతో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

బెజ్జూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బారెగూడ గ్రామంలో హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన సప్తాహం సోమవారం ముగిసింది. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో గ్రామస్థులంతా వారం రోజులపాటు సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులంతా ప్రతి రోజు హాజరై భజన కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగాదేవతామూరులతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## మంత్రి సీతక్కను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

జైనూర్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జైనూర్‌మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెతవిశ్వనాథ్ సోమవారం మంత్రిసీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవి కట్టబెట్టినందుకు మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ ఫోన్‌లో మాట్లాడుతూ జైనూరు మార్కెట్‌ని మరింత అభివృద్ధి పర్చేందుకు నిధులు మంజూరుచేయాలని కోరినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో రైతులకు తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్డి, మూత్రశాలలు మంజురు చేయాలని కోరనన్నారు. దీనికి మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి సీతక్క చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌ను శాలువ కప్పి సత్కరించారు.

### ప్రజాపాలన విజయోత్సవాలను

## ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి హాజరై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపట్టిన గార్యంటీపథకాలైన మహాలక్ష్మి, మహిళలకు ఉచితబస్సు, గృహజ్యోతి, చేయూత పెన్షన్, రైతు రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగ నియమకాలపై ఈనెల19నుంచి డిసెంబరు 7వరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంతోపాటు ఆమండలాల్లోని రెండు గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. గ్రామ స్థాయిలో అన్నిశాఖల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, మహిళాసంఘాల సభ్యులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈనెల23న జిల్లా కేంద్రంలో 80మంది కళాకారులతో కూడిన సాంస్కృతికబృందంతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైనప్రదేశాన్ని గుర్తించి పూర్తి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

#### ప్రతికుటుంబం మరుగుదొడ్లు కలిగి ఉండాలి..

జిల్లాలోని ప్రతికుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా అధికారులతో కలిసి ప్రపంచ టాయిలెట్స్‌డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతికుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, బహిరంగ మలమూత్ర విసర్జనరహిత జిల్లాగా తీర్చిది ద్దాలని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్‌గ్రామీణ్‌లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా అందరం భాగస్వామ్యం అవుదామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఎస్‌బీఎం జిల్లా సమన్వయకర్త నజర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.




# కాంట్రాక్టు కార్మికులకు ప్రమాద బీమా ఒప్పందం

మందమర్రిటౌన్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టుకార్మికులు వారి కుటుంబాల ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా ప్రమాదబీమా కోసం యాజమాన్యం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో ఒప్పందం చేసుకుందని ఎస్‌వోటూ జీఎం విజయప్రసాద్ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఆయావిభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలను సేకరించాలని చెప్పారు. అదేవిధంగా ప్రతీ కార్మికుడు బ్యాంకుల్లో జీరోఅకౌంట్ ఖాతాను తీసుకోవాలన్నారు. విధుల్లో, లేదాబయటిప్రమాదాల్లో మృతి చెందితే ఆకుటుంబానికి రూ.20లక్షల బీమా వస్తుందని తెలిపారు. కార్మికుడు డెబిట్ కార్డును ఆరుమాసాలకు ఒకసారి ఉపయోగిస్తే ఆకుటుంబానికి అధనంగా పదిలక్షలు, కార్మికుల పిల్లలు చదువుకుంటే నాలుగు లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల19 నుంచి కార్మికులు ఖాతాలు తెరిచే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, పాషా, రాము, బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఎస్‌వోటు జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పీ గ్రూపు ఏజెంట్‌గా పనిచేసి ఆర్‌జీ-1 ఏరియాకు ఎస్‌వోటు జీఎంగా వెళ్తున్న గోపాల్‌సింగ్‌ను ఎస్‌ఆర్పీ3గనిపై టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, నాయకులు గరిగెస్వామి, తిరుపతి రాజ్కు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన ఏజెంట్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గోళ్ల బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనలో ముందంజ

శ్రీరాంపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు మౌలిక సదు పాయాలు కల్పించడంలో యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ అన్నారు. ప్రగతిమైదానంలోని వాకింగ్ ట్రాక్, నస్పూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆధునికీరణ పనుల పురోగతిని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రగతి మైదానంలోని వాకింగ్ ట్రాక్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. స్టేడియంలో వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్)అరవిందరావు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, సివిల్ ఇంజనీర్లు గుండేరావు, సత్యనారాయణ, సీనియర్ పీవోలు పి కాంతారావు, పాల్ సృజన్, తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా 'కాంపెల్లి'


కాంపెల్లి సమ్మయ్య

మందమర్రి టౌన్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా మందమర్రి ఏరియా ఎంవీటీసీలో పనిచేస్తున్న సీనియర్ మైనింగ్ సర్దార్ కాంపెల్లి సమ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సమ్మయ్య అనుచరులు హర్షం వ్యక్తం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ మందమర్రిఏరియాలో రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ విజయం లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తనకు ఈ పదవిని కట్టబెట్టిన సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాద బీమా ఖాతాలు పొందండి

శ్రీరాంపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రమాదబీమా కలిగిన బ్యాంకుఖాతాలుపొందాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఒకప్రకటన విడుదల చేశారు. ఏరియాలోని 341మంది ఉద్యోగులు ఇతరబ్యాంకుల్లో ఖాతాలు కలిగిఉన్నారని, వారంతా స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకులలో తమ ఖాతాలను తీసుకోవాలన్నారు. ఆయాఖాతాలతో ఉద్యోగికి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అతని కుటుంబానికి బీమా మొత్తం అందుతుందని తెలిపారు.

### కాంట్రాక్టు కార్మికులకు సైతం...

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సైతం తమ బ్యాంకు ఖాతాలను హెచ్‌డీఎఫ్‌సీబ్యాంకుకు మార్చుకోవాలని డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో సింగరేణి యాజమాన్యం ప్రమాదబీమా ఒప్పందం చేసుకుందని, తమ ఖాతాలను ఆ బ్యాంకుకు మార్చుకొని ఈ అవకాశాన్ని కాంట్రాక్టు కార్మికులు వినియోగించుకోవాలని కోరారు.

## న్యూస్ బాక్స్

### ఎస్టీపీపీలో మిథనాల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

జైపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో మిథనాల్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని సింగరేణి సీఎండీ బలరాం సోమవారం ఇక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ రహిత చర్యలకు పెట్టింది పేరుగా ఉన్న సింగరేణి సంస్థ దేశంలోనే మొట్టమొదటిసారిగా కార్బన్‌డైయాక్సైడ్ వాయువు నుంచి మిథనాల్‌ను ఉత్పత్తి చేసే ప్రయోగాత్మక ప్లాంట్‌ను జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనే సింగరేణి తొలి ప్రయోగాత్మక మిథనాల్ తయారీ ప్లాంటు అని తెలిపారు.

### మట్టి పాత్రల తయారీపై శిక్షణ

గర్మిళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మట్టి పాత్రల తయారీలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ మట్టి పాత్ర తయారీపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. 40 మంది కుమ్మర వృత్తిదారులను రెండు గ్రూపులుగా విభజించి శిక్షణ ఉచితంగా ఇచ్చి సారెలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాంపల్లి మాధవి, నాయకులు తిరుపతి, నాంపల్లి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, నాగేష్, సత్యనారాయణ, రమేష్ ,మల్లేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామస్థులకు ప్రత్యేక ఏర్పాట్లు

జన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మల్యాల గిరిజన గ్రామాన్ని తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ అన్నారు. మండలంలోని మల్యాల గ్రామస్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులకు పునరావాస కాలనీలో చేసే ఏర్పాట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మల్యాల గిరిజన గ్రామాన్ని తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పునరావాసంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎఫ్ఆర్‌వో సుష్మారావు, ఆర్ఐ భాను చందర్, ఎంపీవో జలందర్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నెన్నెల మండలం బొప్పారం వద్ద ఏపుగా పెరిగిన నీలగిరి వనం

# సిరులు కురిపిస్తున్న నీలగిరి..

- ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ప్లాంటేషన్లు
- కాగితపు పరిశ్రమకు ముడిసరుకుగా అమ్మకం
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం
- రంగపేట బీట్‌లో కొనసాగుతున్న కోతలు
- లారీల్లో గుజరాత్‌కు తరలింపు

నెన్నెల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆకాశాన్ని ముద్దాడేలా నిటారుగా పెరిగే నీలగిరి(యూకోలిప్టస్) వనాలు ప్రభుత్వానికి సిరులు కురిపిస్తున్నాయి. కాగితం తయారీకి ముడిసరుకుగా ఉపయోగించే ఈ ప్రాంతపు నీలగిరి కర్రకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అటవి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నెన్నెల, కన్నెపల్లి, జైపూర్, కోటపల్లి, తాండూరు, భీమారం, చెన్నూరు మండలాల్లో సుమారు 2వేల హెక్టార్ల అటవి భూముల్లో నీలగిరి ప్లాంటేషన్లు పెంచుతున్నారు. నెన్నెల మండలంలోని రంగపేట బీట్‌లో 2018లో మొక్కలు నాటారు. అవి పెరిగి కాగితం తయారీకి ఉపయోగించేందుకు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. కటింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి రోజు వందల టన్నుల కర్రను పేపర్ తయారీ కంపెనీలకు లారీల్లో తరలిస్తున్నారు. సాధారణంగా టన్ను నీలగిరి కర్ర బహిరంగ మార్కెట్లో 5,500 నుంచి 6,000రూపాయల వరకు మాత్రమే ఉంటుంది. కాని రంగపేట బీట్‌లోని కర్రకు 8,100 రూపాయలు ధర పలకడం విశేషం. నీలగిరి వనాల పెంపకంతో సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు కూలీలకు, లారీల యజమానులకు ఉపాధి లభిస్తోంది.



లారీలో తరలిస్తున్న నీలగిరి దుంగలు

#### ● బంజరు భూములుల్లోనూ..

నీలగిరి వనాలను రైతులు కూడా పెంచవచ్చు. బంజరు భూములు, ఖాళీ స్థలాలు, పొలం గట్లు, చేల హద్దుల్లో మొక్కలు నాటుకోవచ్చు. జేకే సంస్థ నిర్వహణలో కొనసాగుతున్న సిర్పూర్ కాగితం మిల్లు (ఎస్ పీఎం) ఈ ప్రాంతంలో నీలగిరి వనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. జేకే సంస్థకు గుజరాత్, ఒడిశాలో మరో రెండు పేపర్ మిల్లులు ఉన్నాయి. మూడు పేపర్ మిల్లులకు ముడి సరుకు కొరత లేకుండా ఉండేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో నీలగిరి వనాల పెంపకంపై రైతులకు కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తు న్నారు. భారి రాయితీలు ఇచ్చి వనాలు పెంచేలా ప్రోత్స హిస్తున్నారు. బైబ్యాక్ పాలసీ ద్వారా రైతులతో ఒప్పందం కుదుర్చుకొని నాణ్యమైన క్లోనింగ్ మొక్కలను కంపెనీవారే అందజేస్తు న్నారు. మొక్కలు నాటిన నుంచి దిగుబడిచేతికి వచ్చే వరకు క్షేత్రస్థాయి వచ్చి కంపెనీవారే సలహాలు, సూచనలిస్తారు. నీలగిరి చెట్లు నాటిన మూడు నుంచి నాలు గేళ్లకు కోతకు వస్తాయి. ఎకరానికి రూ. 25 వేల వరకు మాత్రమే ఖర్చు అవుతుంది. అగ్రో ఫారెస్ట్ మోడల్ (రెండు సాళ్ల పద్ధతి)లో నాటుకుంటే అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. ఎకరానికి దాదాపుగా 60 టన్నుల కర్ర దిగుబడి వస్తుంది. టన్నుకు సుమారుగా రూ. 6నుంచి 7వేల వరకు యాజమాన్యం చెల్లిస్తోంది. ఒక్కసారి నాటిన మొక్క నుంచి మూడు సార్లు కర్ర దిగుబడులు పొందవచ్చు.

#### ● బెల్లంపల్లి ఫారెస్టు రేంజి పరిధిలో..

బెల్లంపల్లి ఫారెస్టు రేంజి పరిధిలోని నెన్నెల మండలం రంగపేట బీట్‌లో 2018లో నీలగిరి మొక్కలు నాటారు. ఏపుగా పెరిగిన చెట్లు కోతకు వచ్చాయి. దశల వారిగా కర్రకోసి కాగితం కంపెనీలకు తరలిస్తున్నారు. ఆన్‌లైన్ టెండర్లలో గుజరాత్‌కు చెందిన జేకే కంపెనీ రూ. 8100లకు టన్ను చొప్పున కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇక్కడి నుంచి లారీల్లో గుజ రాత్ రాష్ట్రంలోని సోన్‌గడ్‌కు తరలిస్తున్నారు. కోతలు, లేయర్ తొలగింపు, లోడింగ్‌కోసం వందల మంది కూలీలు పనులు చేస్తున్నారు. చెట్లను మొదటికి కోసి వాటి కొమ్మలు కత్తిరించి మీటరున్నర పొడవు దుంగలుగా కోస్తున్నారు. దుంగపైన బెరడు (లేయర్) తొలగించేందుకు ప్రత్యేకమైన యంత్రాలను ఉపయోగిస్తున్నారు. పొర తొలగించిన దుంగలను రవాణా చేయడం సులువు అవుతుంది. కాగితం తయారీకి ముడి సరుకుగా నేరుగా ఉపయోగించుకోవచ్చు. ఒకే సైజులో కోసిన దుంగలను ఒక్కో లారీలో 25 టన్నుల చొప్పున లోడ్ చేసి గుజరాత్‌కు తరలిస్తున్నారు.



ప్లాంటేషన్ నుంచి దుంగలను యంత్రం వద్దకు తరలిస్తున్న కూలీలు

# పులులు భద్రమేనా..?

3వ పేజీ తరువాయి

#### ● సంరక్షణపై దృష్టి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులల సంచారం పెరగడంతో వాటి సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో పులులు, చిరుతలకు వేటగాళ్ల హాని తలపెట్టిన సంఘటనలు కోకొల్లలుగా ఉండటంతో పూర్తిస్థాయిలో అధికారులు అప్రమత్తమయ్యారు. మహారాష్ట్ర నుంచి వచ్చే పులులు కొంతకాలం ఇక్కడే ఉండే అవకాశాలున్న నేపథ్యంలో ఆటవీ అధికారులు ఆప్రమత్తమయ్యారు. పులులు సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా వాటి కదలికను గుర్తిస్తూ రక్షణచర్యలు చేపడుతున్నారు. నిత్యంరివ్యూ చేస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఎనిమల్ ట్రాకర్లు, బేస్ వాచర్లు అడవుల్లో సంచరిస్తున్నారు. టైగర్ మానిటరింగ్ సెల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దీనిద్వారా ప్రతిరోజూ వాటి కదలికలను గమనిస్తున్నారు. పులి సంచారం విషయం తెలియగానే ఐదు కిలోమీటర్ల పరిధిలో అడవుల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. అడవుల్లో విద్యుత్ వైర్లను గమనించడం, ఇతర ఉచ్చులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాగజ్‌నగర్ అడవుల్లో పలు చోట్ల విద్యుత్ వైర్లను అటవీ సిబ్బంది గమనించడం గమనార్హం.

#### జిల్లాలో చోటు చేసుకున్న పలు ఘటనలు..

- హాజీపూర్ శివారులోని బుగ్గగట్టు సమీపంలో మామిడి తోటలో గొర్రెల మందపై పులి దాడి చేసి ఓ గొర్రెను హతమార్చగా, మరో గొర్రెను లాక్కొని వెళ్లింది.
- హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులోని ర్యాలీవాగు ప్రాజెక్టు సమీపంలోని గేదెల మందపై దాడి చేయగా, ఓ గేదె తీవ్రంగా గాయపడింది.
- కాసిపేట మండలం గురువాపూర్, పెద్దధర్మారం, చింతగూడ, సల్పలవాగు ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నది. గురువాపూర్ శివారులో మూడు. ఆవులపై దాడి చేయగా, అవి మృత్యువాత పడ్డాయి.

#### రక్షణ చర్యలు చేపడుతున్నాం..

ప్రస్తుతం పులులు సంచరించే సమయం కావడంతో కవ్వాల్ టైగర్‌జోన్ పరిధితోపాటు, ఇతర ప్రాంతాల్లోనూ అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది నిత్యం అడవుల్లో సంచరిస్తూ పులుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. పులి సంచరించిన ఐదు కిలోమీటర్ల రేంజ్‌లో పులికి హానికలించే విద్యుత్ వైర్లు, ఉచ్చులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పులులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని సమీప గ్రామాల ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం.

**- శాంతారాం, ఫీల్డ్ డైరెక్టర్**

### ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బెల్లంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజలు వారి సమస్యలపై ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖ అధికారులకు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ఏయే సమస్యలున్నాయో తెలుసుకునే వెసలుబాటు ఉంటుందని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నామని చెప్పారు. ప్రతీ నెల క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్‌నిర్వహి స్తామని, నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రజాదర్బార్‌ను బెల్లంపల్లిలో నిర్వహిస్తు న్నానని చెప్పారు. ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి స్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్:** కాసిపేట గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని క్యాంపు కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామికి గ్రామస్థులు విన్నవించారు మండలంలోని కాసిపేట గ్రామంలోని ఐదో వార్డు విలేజ్ ఎంట్రెన్స్‌లో డ్రైనేజీలో మురుగునీరు రోడ్లపై పారితుం దని తెలిపారు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నుంచి ప్రకృతి వనం వరకు వీధిలైట్లు లేవని, వీధి లైట్లు ఏర్పాటు చే యాలని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్థులు సాలిగామ మల్లేష్, పాత నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత భారత్‌కు పునాది




మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో ఉన్న సహకార సంఘాల సభ్యులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వికసిత భారత్‌కు పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని యూనివర్శల్ అర్బన్ సహకార బ్యాంకు సమావేశంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సహకార శాఖ అధికారి బి సంజీవరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా సహకార మంత్రిత్వ శాఖ ద్వారా 56 అంశాలలో సహకార రంగానికి అత్యంత ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు. సంఘాలు పరస్పర సహకారంతో ప్రగతి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. గోదాములు, పెట్రోలు బంకులు, ఖాళీ స్థలాలు అందించేందుకు అనుకూలంగా ఉన్నామని చెప్రాడు. మహిళా సంఘాలు సోలార్ పరిశ్రమలు, క్యాంటీన్ తదితరులు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహం ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలో ప్రగతి కనబర్చిన సంఘాలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట కాకతీయ సహకార శిక్షణ కేంద్రం వరంగల్ ప్రిన్సిపాల్ లూనవత్ యాకూబ్ నాయక్, బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్, సీఈవో మూర్తి, సహకార శాఖ అధికారులు కె. రవీందర్ రావు, మల్లారెడ్డి, హన్మంతరెడ్డి, రవికిశోర్, సందీప్‌కుమార్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్‌లు, కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**చెన్నూరు:** చెన్నూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం వరిధాన్యం కొనుగోళ్లలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ధాన్యం కొనుగోళ్లలో జిల్లాలో అందరి కంటే మెరుగ్గా వ్యవహరించినందుకు సహకార సంఘం అధ్యక్షుడు చల్లం రాండిరెడ్డి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అభినందించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాంరెడ్డికి కలెక్టర్‌తో పాటు పీఏసీఎస్ అధికారులు జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జన్నారం:** జిల్లాలో రైతు సేవలో ముందున్న మండలంలోని పొనకల్ సింగిల్ విండో సొసైటీకి ఉత్తమ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం దక్కింది. ఈ మేరకు కలెక్టర్ కుమార్ దీపక్, డీసీవో సంజీవరెడ్డి చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో సోమవా రం సొసైటీ చైర్మన్ అల్లం రవి, కార్యదర్శి రాజన్న అవార్డును అందుకున్నారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని పడ్తన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుదన్నారు. తూకం వేసే యంత్రం, గన్ని సంచులు, ప్యాడి క్లినర్ లాంటివి ఏర్పాటు చేశామన్నారు. పడ్తన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 37 మంది ధాన్యం ఆరబోసుకున్నారని, ఇందులో ముగ్గురికి మాత్రమే 17 తేమ శాతం వచ్చాయని, మిగితావారికి తేమ శాతం రాలేదన్నారు. తేమ శాతం వచ్చిన రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడానికి సిబ్బంది సిద్దంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్‌పాండే , ఏవో కృష్ణ, ఏపీఎం రాజన్న, పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

భీమారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి, మద్దికల్, బూరుగుపల్లి, ఎల్కేశ్వరం, కొత్తపల్లి , ఎల్బీపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పీఏసీఎస్ డైరెక్టర్‌లు పానుగంటి లక్ష్మణ్, ఆత్కూరి పోశమ్మ, వైస్ చైర్మణ్ చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో చేకుర్తి సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచు గడ్డె రాంరెడ్డి, రాము, శ్రీనివాస్, అమర్‌సింగ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల ను అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా భీమారం, తాండూర్, దండేపల్లి, నెన్నెల, మంచిర్యాల, వేమనపల్లి, నస్పూర్ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన

నస్పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం సాధన గ్రీన్ కీడ్స్ స్కూల్ విద్యార్థులు కాగజ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించడంతో సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ పెంచాల శ్రీధర్, కరస్పాడెంట్ సంధ్య, ప్రిన్సిపాల్ నాగమణి, పీఇటి సుజన, కరాటే మాస్టర్ రంగ రమేష్‌లు అభినందించారు. బహుమతులు సాధిం చిన విద్యార్థులల్లో ప్రధమ స్థానంలో వర్షిణి, శివసాయి తేజశ్రీ, అమిత, అన్వి త్, ద్వీతీయ స్థానంలో సంజయ్ కుమార్, అమన్, శివమణి, సాత్విక్, కార్తికేయ, తృతీయ స్థానంలో శ్రీకాంత్, అంజన్ కుమార్, భగత్, హనురామ్, శ్రీతిక్, సాయిదీక్షిత, సాయి నిహాల్ ఉన్నారు.

**తాండూర్:** కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సురేష్ బ్లాక్‌బెల్ట్ విభాగంలో గ్రాండ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థిని మాస్ట ర్లు ప్రసాద్, విష్ణు, హరికృష్ణ, నరేష్ తదితరులు అభినందించారు.

# కార్మికులకు అండగా..

- పదవీ విరమణ పొందినా నిరంతర పోరాటం
- ఏడు పదుల వయస్సులో కూడా యూనియన్ల ప్రతినిధులుగా సేవ



మందమర్రి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొగ్గు బావుల్లో పని చేస్తున్న సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల సాధన కోసం ఏడు పదుల వయస్సులోనూ పాటుపడుతున్నారు పలువురు నాయకులు. నిరంతరం సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తూ కార్మికుల సేవకు అంకితభావంతో పని చేస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం కూడా శేషజీవితాన్ని కుటుంబాలతో గడపకుండా కార్మిక రంగానికే వారి జీవితాన్ని అంకితం చేస్తు న్నారు. ప్రధానంగా అన్ని జాతీయ సంఘాల్లో కింది స్థాయి నాయకత్వానికి దిశానిర్దేశం చేస్తూ యాజమాన్యం విధానా లను ఎలా ఎదుర్కోవాలో సూచనలిస్తున్నారు.

**బి జనక్ ప్రసాద్, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్**



జనక్ ప్రసాద్ మందమర్రి జీఎం కార్యాలయంలో క్లర్కుగా, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా 40 సంవత్సరాలపాటు పని చేశారు. ఐఎన్టీయూసీలో సెక్రెటరీ జనరల్‌గా, యూనియన్ పటిష్టతకు ఆయన నిరంతరం పాటుపడు తున్నారు. యూనియన్‌కు చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని కనీస వేతనాల మండలి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సింగరేణిలో కార్మికులకు సంబంధిం చిన ఎలాంటి సమస్యనైనా పరిష్కరించడంలో ఆయన ముందుంటారు. కార్మిక చట్టాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. యాజమాన్యంతో సమస్యల గురించి చర్చించి వాటిని పరిష్కరిస్తారనే పేరుంది. 72 సంవత్సరాలు ఉన్నప్పటికి యూనియన్‌కు ఆయనే పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారు.

**వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు**




సింగరేణిలో మందమర్రి ఏరియాలోని ఆర్కే 1ఏ గనిలో సీనియర్ అసి స్టెంట్‌గా ఉద్యోగ విరమణ పొందాడు. 38 సంవత్సరాలు విధులు నిర్వహిం చారు. ఇప్పటికి కార్మిక సమస్యలపై పోరాటాలు చేస్తూనే ఉన్నారు. సింగరేణి లో ఏఐటీయూసీ ఐదు సార్లు గుర్తింపు సంఘంగా గెలవడంలో సీతారామయ్య ప్రధాన పాత్ర పోషించారు. ఎప్పటికప్పుడు కార్యకర్తలతో మమేకమై పని చేస్తుంటాడు. 69 సంవత్సరాల వయస్సులో కూడా అలుపెరుగకుండా ప్రయాణం చేస్తుంటాడు. క్యాతన్‌పల్లి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సర్పంచ్‌గా పని చేశాడు. కార్మిక చట్టాలపై అధ్యయనం చేసి సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారు.

**రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సింగరేణి విభాగం ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డు సభ్యుడు**




సింగరేణిలో 1974లో ఎలక్ట్రిషియన్ ట్రైనీగా ఉద్యోగంలో చేరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అప్పటి నుంచే పోరాట పంథాను ఎంచుకున్నారు. హెచ్‌ఎంఎస్‌లో చేరి అంచెలంచెలుగా యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎంపిక అయ్యారు. సింగరేణిలో ఎప్పటికప్పుడు యాజమాన్య విధానాలను ఎండగట్టడంలో ఆయనకు సాటి లేరని చెప్పవచ్చు. సింగరేణిలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా ఉద్యోగ విరమణ పొందారు. 42 సంవత్సరాలు ఆయన పని చేశారు. హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

**తుమ్మల రాజిరెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు**



సింగరేణిలోని రామగుండం రీజియన్‌లో అప్రెంటీషిప్ ఫిట్టర్‌గా ఉద్యోగంలో చేరారు. 35 సంవత్సరాల పాటు పని చేసి మెకానికల్ ఫోర్‌మెన్‌గా 2020లో ఉద్యోగ విరమణ పొందారు. మూడు దశాబ్దాలుగా యూనియన్ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాడు. కార్మికుల హక్కులపై ఆయన అలుపెరుగని పోరాటం చేస్తుంటారు. 65 సంవత్సరాల వయసులో కూడా సింగరేణిలో తన ప్రయాణాన్ని సాగిస్తున్నాడు. యూనియన్‌కు సంబంధించిన సమావేశాలు ఎ క్కడ నిర్వహించినా ప్రధాన వక్తగా వ్యవహరిస్తుంటారు. ప్రస్తుతం ఆయన ఓసీలను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ చేపట్టారు.



## న్యూస్ బాక్స్

### నేడు గణపతికి మధురాభిషేకం

నస్పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో మంగళవారం అంగారక సంకట హర చతుర్థిని పురస్కరించుకుని స్వామి వారికి 108 కిలోల తేనేతో మహా మధురాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీ కృష్ణశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30 గంటలకు షోడశ ద్రవ్యాభిషేకం, 7.30గంటలకు గణ పతి, లక్ష్మి గణపతి హోమం, సాయంత్రం 6.30 గంటలకు 108 కిలోల తేనేతో స్వామి వారికి మహా మధురాభిషేకం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### రైతులు వరి కొయ్యలను కాల్చవద్దు

జన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పొలంలో వరి కోసిన తర్వాత కొయ్యలను కాల్చవద్దని కవ్వాల క్లస్టర్ ఏఈవో అక్రమ్ తెలిపారు. స్థానికంగా సోమవారం ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలో ఉండే సేంద్రియ కార్బనం, పంట పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు నశిస్తాయన్నారు. కొయ్యలను నేలలో కలియ దున్ని సింగిల్ సూపర్ పాస్ఫట్ వేయడం ద్వారా ఎరువుగా తయారవుతుందని తెలిపారు.

### అయ్యప్ప మండల పూజ

మందమర్రి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిహర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మినీ మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 3 గంటల వరకు ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అయ్యప్ప మాల స్వీకరించిన భక్తులు పెద్ద సంఖ్యలో మండల పూజలో పాల్గొన్నారు.

# పులులు భద్రమేనా..?



- కవ్వాల్ టైగర్ జోన్‌లో సంచారం
- పశువులపై దాడితో జిల్లాలోనూ అలజడి
- ధ్రువీకరించిన అటవీశాఖ అధికారులు
- ట్రాకింగ్ కెమెరాల ఏర్పాటుతో రక్షణ చర్యలు

మంచిర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్ద పులులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అలజడులు సృష్టిస్తున్నాయి. ఆవుల మందలపై వరుస దాడులతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల జిల్లాలోని హాజీపూర్ మండలంలో ఓ రైతుకు చెందిన మేకల మందపై దాడిచేసిన పులి అనంతరం కాసిపేట మండలం పెద్ద ధర్మారంలోనూ సంచరించింది. మండలంలోని మామిడి గూడెం పంచాయతీ పరిధిలోని గోండు గూడెం గిరిజన రైతుకు చెందిన రైతు ఆవుల మందపై దాడి చేయగా, పెద్ద ధర్మారం రహదారిపై అధికారులు పులి అడుగులను గుర్తించారు. జిల్లాలోని అడవుల్లో పులి సంచరిస్తుండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో నిత్యం ఎక్కడోచోట పులుల కదలికలు ఉంటూనే ఉన్నాయి. కవ్వాల్ అభయారణ్యం లోనూ మరో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధి కారులు గుర్తించారు. నిర్మల్ జిల్లా పశ్చిమ కనుమ ల్లో మకాం వేసిన టైగర్ అటవీ సమీపంలోని పల్లెల్లో పశువులపై దాడులు చేస్తుండటంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

#### మహారాష్ట్ర నుంచి వచ్చినవే..

మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశించిన పులులు పక్షం రోజులుగా ఇక్కడే తచ్చాడుతున్నాయి. నిర్మల్ జిల్లా సహ్యాద్రి పర్వత శ్రేణుల్లోకి ప్రవేశించిన పెద్దపులి గీత పక్షం రోజులుగా ఇక్కడే మకాం వేసింది. కుబీర్ మండలం నుంచి కడెం వరకు విస్తరించి ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణుల్లోని అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అటవీ ప్రాంతం పెద్దపెద్ద చెరువులు, కుంటలు, జలాశయాలకు ప్రసిద్ధి. వన్యప్రాణుల నివాసానికి మన జిల్లా అడవులు అనువైనవి కావడంతో పెద్దపులి సైతం ఇక్కడి సహ్యాద్రి పర్వతాల్లో మకాం వేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి, తలమడుగు అడవుల నుంచి ఈ పులి నిర్మల్ జిల్లాలోని అడవుల్లో ప్రవేశించినట్లు తెలుస్తోంది. అలాగే మంచిర్యాల జిల్లాలోని జన్నారం, లక్సెట్టిపేట, మంచిర్యాల, బెల్లంపల్లి అటవీ రేంజ్‌ల పరిధితోపాటు ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రేంజ్ అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ పులి గతకొంత కాలంగా మంచిర్యాల జిల్లాలోనే మకాం వేసినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా జిల్లాలోని హాజీపూర్, కాసిపేట మండలాల్లో సంచరిస్తుండగా, కొద్ది రోజులపాటు ర్యాలీగడ్ పూర్ దట్టమైన అడవుల్లో మకాం వేసినట్లు అధికారులు ధృవీకరిస్తున్నారు. మిగతా 5వ పేజీలో




## కార్మికులకు అండగా..

- పదవీ విరమణ పొందినా నిరంతర పోరాటం
- ఏడు పదుల వయస్సులో కూడా యూనియన్ల ప్రతినిధులుగా సేవ

5



## సిరులు కురిపిస్తున్న నీలగిరి

- ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ప్లాంటేషన్లు
- కాగితపు పరిశ్రమకు ముడిసరుకుగా అమ్మకం
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం
- రంగపేట బీట్‌లో కొనసాగుతున్న కోతలు
- లారీల్లో గుజరాత్‌కు తరలింపు

5



బెరుడు తొలగించి లారీలో తరలిస్తున్న నీలగిరి దుంగలు

### కొనుగోలు కేంద్రం పరిశీలన

హాజీపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పడ్తన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, మంచిర్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పద్మమణి, నాయకులు పుస్కూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని విమర్శించడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాధవరాపు రాజేశ్వర్‌రావు, సింగిల్ విండో ఛైర్మన్ సత్తయ్య, రామారావు, శ్రీనివాస్‌గౌడ్, డేగ బాపు, మహేందర్, సుమలత, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### 21న ఆస్పత్రుల పనులకు భూమి పూజ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

గర్మిళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో నిర్మించే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మాతా శిశు ఆస్పత్రి పనులకు ఈ నెల 21న భూమి పూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. సోమవారం స్థలం చదును చేసే పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల నిర్మాణంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించాలి : సీపీ శ్రీనివాస్

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా కోటపల్లి మండలం రాపన్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 24 గంటలు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. చెక్‌పోస్టును సోమవారం పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా డబ్బుమద్యం, వస్తువులు తరలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం రవాణా కాకుండా సివిల్ సప్లై వారు చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందని, సంయుక్తంగా మహారాష్ట్ర నుంచి ధాన్యం వాహనాలు వస్తే తనిఖీ చేసి సివిల్ సప్లై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల తనిఖీ నమోదు రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు సుబ్బారావు, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న డివిజన్ అధికారి సర్వేశ్వర్

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలోని అర్బన్ పార్కులో డివిజన్ పరిధిలోని మూడు రేంజ్‌ల అధికారులకు సోమవారం అటవీ రక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై రివ్యూ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డివిజన్ అధికారి సర్వేశ్వర్ మాట్లాడుతూ అటవీ సమీపంలోని గ్రామాల్లో అక్రమ విద్యుత్ తీగలు అమర్చి వన్య ప్రాణులను చంపకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. రిజర్వుడ్ ఫారెస్టులోని చెట్లు నరకకుండా కాపాడాలన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ఫీల్డ్ అధికారులు అప్పలకొండ, సదానందం, డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రభాకర్, ప్రమోద్‌కుమార్, నందిని, సెక్షన్ అధికారులు అంజయ్య, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన

మంచిర్యాల అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేటలో ఈ నెల 17, 18వ తేదీల్లో అండర్ 19 స్కూల్ గేమ్స్ అధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం అధికారులు అభినందించారు. అండర్ -40 కేజీల విభాగంలో కాసర్ల శ్రీజ బంగారు పతకం, అండర్ 63కేజీల విభాగంలో అస్మిత బంగారు, అండర్ 73 కేజీల విభాగంలో జగదీష్ కాంస్య పతకాలను సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకా రులను ఎస్‌జీఎఫ్ అండర్ 19 సెక్రటరీ బి.బాపురావు, డీఐఈవో అంజయ్య, తైక్వాండో సెక్రటరీ వెంకట స్వామి, ప్రెసిడెంట్ బుచ్చి రామారావు, శిక్షకులు మండ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

**మంచిర్యాల అర్బన్:** మెదక్ జిల్లాలోని రేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలికల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చెరుకు పణిరాజా సోమవారం తెలిపారు. గెలుపొందిన జట్టు సభ్యులను డీఈవో ఎస్.యాదయ్య, జిల్లా కోచ్ గాజుల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రాంమోహన్, యాకూబ్, సీనియర్ క్రీడాకారుడు అనుదీప్ తదితరులు అభినందించారు.

## ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

- 8,246 మంది హాజరు - పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు



నస్పూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న సీపీ శ్రీనివాస్



మంచిర్యాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో జిల్లాలో సోమవారం ఆఖరి రోజు గ్రూప్ 3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. 15,038 మంది అభ్యర్థులకు గానూ 8,246 మంది హాజరయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ట్రినిటీ, ఎస్ఆర్ఆర్, ఆక్స్‌ఫర్డ్ పరీక్ష కేంద్రాలను పరీక్షల నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐలు, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించారు. కాగా ఈ నెల 17,18 తేదీల్లో జిల్లాలో నిర్వహించిన గ్రూప్ 3 పరీక్ష ఆఖరి రోజు సోమవారం ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ, ఎస్ఆర్‌డీజీ పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని చెప్పారు. అభ్యర్థుల కు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకు న్నామన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామన్నారు.

**మంచిర్యాల అర్బన్:** జిల్లా కేంద్రంలోని గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను రామగుండం సీపీ శ్రీనివాస్ సోమవారం డీసీపీ ఏ భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు, పరీక్ష అనంతరం ఎగ్జామ్ షీట్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపుపై పోలీస్ అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎగ్జామ్ నోడల్ అధికారి, అడిషనల్ డీసీపీ సి.రాజు, ఏసీపీ ఆర్.ప్రకాష్, టౌన్, రూరల్ సీఐలు ప్రమోద్‌రావు, అశోక్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**హాజీపూర్:** మండలంలోని వేంపల్లిలోని ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ 3 పరీక్ష కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ఆఖరు రోజున 8,185 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

**నస్పూర్:** నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాల, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల, సింగరేణి హైస్కూల్, మార్టిన్స్ గ్రామర్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల్లో రెండవ రోజు సోమవారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ సందర్శించారు. పరీక్ష జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ కేంద్రాల వద్ద బందోబస్తు, భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమాల్లో మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, రూరల్ సీఐ ఆకుల ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి టౌన్:** పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న పరీక్షలు సోమవారం ముగిశాయి. పట్టణ పరిధిలో ఏడు సెంటర్లు ఏర్పాటు చేశారు. 2,064 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా రెండో రోజు 1,200 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఉదయం నుంచేపరీక్ష కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులను సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ పరిశీలించారు

### గూడెంలో భక్తుల సందడి



ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దండేపల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులతో భక్తుల సందడి నెలకొంది. భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవుడిని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. 320మంది భక్తులు కుటుంబ సమేతంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను నోముకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయంలోని రావి చెట్టు, ప్రధానలయ ఎదుట గల ధ్వంజస్తంభం వద్ద ఉసిరి కాయలతో కార్తీక దీపాలు వెలిగించారు.

### విద్యార్థులకు బహుమతులు అందజేత

దండేపల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర ు11న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి జోన్ సమన్వయకర్త గంప రవిందర్, యూత్ సమన్వయకర్త వై శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

### కూచిపూడి పోటీల్లో కళాకారుల ప్రతిభ

గర్మిళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫారం ఫ్రైడ్ ఇండియా కల్చర్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోనిసోమవారం నిర్వహించిన నేషనల్ లెవెల్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్‌లో మంచిర్యాల జిల్లాలోని నందిని నృత్యాలయం కళాకారులు ప్రతిభ కనబర్చారు. నృత్యాలయం ఫౌండర్,గురువు, నాట్య విభూషణి అన్నం కల్పన శిష్య బృందం శ్రీకరి, వినుజ, ఓజస్వి, శివాళిక, అభిజ్ఞ, హిరణ్య, సాధిక, అలోఖి, జ్ఞాపిక, ప్రవస్తి, ఆరాధ్య, గీతిక కూచిపూడి నాట్య ప్రదర్శనల్లో ప్రతిభ చాటారు. గురువును, కళాకారులను నిర్వహకులు అవార్డు అందజేసి సర్టిఫికెట్, మెడల్స్ అందజేసి సత్కరించారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మహాత్మాజ్యోతి బాఫూలే విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రకాష్ తెలిపారు. అండర్ 14 షాట్‌పుట్ విభాగంలో జి. సాత్విక్ బంగారు పతకం , 80 మీటర్ల హార్డిల్స్‌లో కె.మణికంట సిల్వర్ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పీఈటీలు విజయ్‌కుమార్ ,ప్రభాకర్ అభినందించారు.

### సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

మందమర్రిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంట గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్,మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్యలు బాధితులకు అందజేశారు. ఉప్పులపు భూమయ్యకు రూ. 50 వేలు, రాంటెంకి సత్యనారాయణకు రూ. 15 వేల చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. నాయకులు ఓదెలు, సంపత్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కోతుల దాడిలో గాయపడిన కార్మికుడికి పరామర్శ

శ్రీరాంపూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న మోర లక్ష్మయ్య అనే కార్మికుడిపై కోతులు దాడి చేయగా, అతడిని ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. కోతుల బెడద నుంచి కార్మికులను కాపాడాలని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్లను కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు మహేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్, వేణు, లక్ష్మణ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా నిర్మించిన షెడ్లు కూల్చివేత



షెడ్డును కూల్చివేసిన సిబ్బంది

నస్పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ శివారులోని సర్వే నంబరు 64 కొత్త చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన షెడ్లను సోమవారం సాయంత్రం మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఏడు షెడ్లను ఎక్స్‌కావేటర్ తో కూల్చివేశారు. కొత్త చెరువు (తిలక్‌నగర్) ఎఫ్‌టీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని షెడ్లను తొలగించారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అనుమతులు లేకుండా కట్టడాలు చేస్తే కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మాంతయ్య, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ యశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నాసిరకం భోజనం పెడుతున్నారని నిరసన

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు నాసి రకం భోజనం సరఫరా చేస్తున్నారని, రోగుల బంధువులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. భోజనం సరఫరాచేస్తున్న వారిని రోగుల బంధువులు నిలదీశారు. ఆసుపత్రిలో రోగులకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనంతో పాటు అల్పాహారం,పాలు నాసిరకంవి అందిస్తు న్నారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం ఆసుపత్రికి వస్తుండడంతో విధిలేక ఇదే భోజనాన్ని తింటున్నామని చెప్పారు. ఉన్న తాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఉపాధ్యాయుడికి ఇన్‌స్పిరేషన్ అవార్డు




ఇన్‌స్పిరేషన్ అవార్డు అందుకుంటున్న ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్

జైపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందారం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ఇన్‌స్పిరేషన్ అవార్డు అందుకున్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియంలో గల భాస్కర ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ పట్నం కమల మనోహర్, శాతావాహన యూనివర్శిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, ప్రముఖ రోబోటిక్ సంస్థ సీఈవో మునిష్‌జిం దాల్‌లు అవార్డును అందజేశారు. పిల్లలకు చిత్రలేఖన పై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్న శ్రీనివాస్‌కు అవార్డు అందజేశామని తెలిపారు.

### రోడ్డు పనులు ప్రారంభం

మందమర్రి టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో వార్డులో 78 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. చెన్నూరు ఎమ్మెల్యే ఇటీవల ఈ పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. 14 నుంచి 18 వార్డుల వరకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.